# కలం స్నేహం

-ఎస్.వేణుగోపాల్



"డియర్ శ్రావ్య!

హాయ్ ఫ్రెండ్! నేను సిరిచందనని. బావున్నావా! వారపత్రికలో నా అభిరుచులు, చిరునామా తెలుసుకుని నా నుండి కలంస్నేహాన్ని కోరుతూ నువ్వు పంపిన ఉత్తరం చేరింది. నీ అభిరుచులు నన్నెంతగానో ఆకట్టుకున్నాయి. నిన్ను నా కలంస్నేహితురాలిగా అంగీకరిస్తున్నాను. నీ పేరు చాలా బావుంది. నువ్వు కూడా చాలా అందంగా ఉంటావని అనుకుంటున్నాను. నా స్నేహితురాలు ఎలా ఉంటుందో చూడాలని ఉంది. కావున ఈసారి నీ లెటర్‌తో పాటూ, నీ అందమైన ఫోటో కూడా పంపగలవు. మన ఈస్నేహం కలకాలం కొనసాగాలని కోరుకుంటున్నాను.

ఇక సెలవా మరి.

ఇట్లు

నీ స్నేహితురాలు

సిరిచందన"

* **

"ప్రియమైన సిరిచందనకి!

నీ స్నేహితురాలు శ్రావ్య రాయునది ఏమనగా నీ ప్రత్యుత్తరం చేరింది. నన్ను నీ స్నేహితురాలిగా అంగీకరించినందుకు నాకెంతో సంతోషంగాంది. నిజంగా నా అభిరుచులు నిన్నంతగా ఆకట్టుకున్నాయా సిరిచందనా! కానీ ఫ్రెండ్ నువ్వు నాఫోటో పంపమన్నావు. నేను పంపలేకపోయాను. ఎందుకో తెలుసా! చెబితే నీకు కోపమొస్తుందేమో నువ్వనుకుంటున్నట్లుగా నేను అమ్మాయిని కాదు. అబ్బాయిని. నా పేరు తరుణ్. నేను అబ్బాయిగా నీ స్నేహాన్ని కోరితే నువ్వంగీకరించవని అమ్మాయినని అబద్ధం రాశాను. ఇప్పుడు నీ అభిరుచులూ, నా అభిరుచులూ ఒకరివి ఒకరికి నచ్చాయి. కాబట్టిఅమ్మాయి, అబ్బాయి అనే తేడా మన స్నేహంలో ఉండదు. నేను చెప్పిన ఈ చిన్న అబద్ధాన్ని అర్థం చేసుకుని మన స్నేహానికి అంతరాయం కలగకుండా ప్రత్యుత్తరం రాస్తావని ఆశిస్తున్నాను.

ఉంటామరి!

నీ స్నేహితుడు

తరుణ్"

* **

తరుణ్‌కి రాయునది!

"మిస్టర్! నువ్వు అమ్మాయినని అబద్ధం చెప్పి నన్ను మోసం చేశావ్. కానీ నీకు తెలియని విషయమొకటుంది. అదేమిటంటే నేను కూడా అమ్మాయిని కాదు. అబ్బాయినే. నా పేరు కార్తీక్. సిరిచందన నా కలంపేరు. మేగజైన్‌కి నా అసలు పేరు కార్తీక్ అని రాస్తే అబ్బాయినని ఎవ్వరూ లెటర్స్ రాయరని నా కలంపేరు ఇచ్చాను. అర్థమయిందా! కాబట్టి ఇంకెప్పుడూ నువ్వు నాకు లెటర్ రాయొద్దు. ఎందుకంటే నేను అబ్బాయిలతో స్నేహం చేయను.

ఇట్లు

కార్తీక్"

* **

కార్తీక్‌కి రాయునది!

"నీ ప్రత్యుత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. ఏంటి? ఆశ్చర్యపోతున్నావా! నువ్వు నమ్మినట్లుగా నేను అబ్బాయిని కానే కాదు. నాపేరు తరుణ్ అంతకన్నా కాదు. నేను శ్రావ్యనే. నీ నిజస్వరూపం బయటపడాలనే నేనలా అబద్ధంచెప్పాను. నా అనుమానం నిజమయింది. నువ్వు అబ్బాయివేనని తేలిపోయింది. అబ్బాయివయ్యుండి అమ్మాయిపేరుతో వివరాలు ఇచ్చి కలం స్నేహానికే కళంకం తీసుకొచ్చావ్ నువ్వు. కానీ తెలివితేటలు నీకే ఉండవు. అవి అందరి సొత్తు. ఇంకెప్పుడూ నువ్వు నాకు లెటర్ రాయవద్దు. ఎందుకంటే నేను కూడా అబ్బాయిలతో స్నేహం చెయ్యను.

ఇట్లు

నీ మాజీ స్నేహితురాలు

శ్రావ్య"

★